


నాలుగు తాటాకిళ్లు దగ్ధం

తిమ్మాపురం వాల్మీకి వీధిలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో నాలుగు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. 8లో



మండిపోతున్న ఎండలు

జిల్లాలోసూర్యుడు నిప్పలు చెరుగుతున్నాడు. 37నుంచి 39 డిగ్రీల వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. 8లో



ప్రయాణం....భయం భయం

మారేడుమిల్లి- భద్రాచలం ఘాట్ రోడ్డులో ప్రమాదం పొంచి ఉంది. వాహన చోదకుల భద్రతపై దృష్టి సారించాలి. 8లో

న్యూస్‌రీల్

జోరుగా కొంకొడికూర విక్రయాలు



కొంకొడి కూర

పెదబయలు: పలు గ్రామాల్లో కొంకొడికూర అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అడవుల్లో లభించే పలు రకాల ఆకుకూరలను సీజన్‌లో ఆహారంగా తీసుకుంటారు. మే నెలలో కురిసే వర్షాలకు అడవుల్లో కొంకొడి కూర బాగా పెరుగుతుంది. దానిని సేకరించి గిరిజన రైతులు చిన్న చిన్న కట్టలుగా కట్టి సంతలు,మండల కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. చిన్న కట్టను రూ.15 నుంచి రూ. 30 వరకు విక్రయిస్తున్నారు. ఈ ఆకుకూరను తోటకూర వండినట్టు పప్పు, రాజ్‌మా, బొబ్బర్లు, కందులను కలిపి వండి తింటారు. వర్షాలు ప్రారంభంలోనే ఇది లభిస్తుంది. ఈ సీజన్‌లో మాత్రమే దొరికే కొంకొడి కూరకు మన్యంలో మంచి డిమాండ్ ఉంది.దీనిని తొలకరి కూరగా కూడా పిలుస్తారు.

ప్రత్యేక శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- డీడీ కొండలరావు




ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న డీడీ కొండలరావు

జి.మాడుగుల: టెన్త్ ఫెయిల్ అయిన విద్యార్థులందరూ ప్రత్యేక శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని, మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని డీడీ కొండలరావు తెలిపారు. చింతపల్లి, జీకేవీధి, జి.మాడుగుల మండలాల్లోని టెన్త్ ఫెయిల్ అయిన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు స్థానిక జీఎం కొత్తూరు(బాలురు-2) ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలో, బాలికలకు గాంధీనగర్‌లో గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలల్లో ప్రత్యేకశిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆ తరగతులను బుధవారం డీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులు వచ్చేనెల 8వ తేదీ వరకూ జరుగుతాయని చెప్పారు. అనంతరం జగనన్న విద్యా కానుక కిట్స్ స్టాక్ పాయింట్‌ను డీడీ తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖరరావు, ఏటీడబ్ల్యూవో తిరుపాల్, ఎంఈవో-2 సుందరమ్మ పాల్గొన్నారు.

ఏపీఆర్ఎస్ ప్రవేశపరీక్షలకు ఏర్పాట్లు

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులోని ఐదు కేంద్రాల్లో ఈనెల 20వ తేదీ ఉదయం 10గంటలకు జరిగే ఏపీఆర్ఎస్ సీఏటీ-2023 ప్రవేశపరీక్ష, మధ్యాహ్నం 2.30గంటలకు జరిగే ఏపీఆర్ జేసీ సెట్ ,డీసీసెట్‌లకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు డీఈవో సలీమ్‌బాషా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఐడీ నంబర్,పుట్టినతేదీ ద్వారా వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.హాల్‌టికెట్లకు సంబంధించి ఎలాంటి తప్పులు, సందేహాలు ఉన్నా హెల్ప్‌లైన్ నంబర్ 9502043650లో సంప్రదించాలని తెలిపారు.పరీక్షలు రాసే విద్యార్థులు గంట ముందుగానే ఆయా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఆయన కోరారు.

వాలసీలో అందుబాటులోకి సెల్‌సిగ్నల్స్



వాలసీలో టవర్ వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న సర్పంచ్ సన్యాసిరావు, గ్రామస్తులు

అనంతగిరి: మండలంలోని మారుమూల వాలసీ పంచాయతీ కేంద్రంలోని బుధవారం సెల్ సిగ్నల్స్ అందుబాటులోకి వచ్చాయి. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు సెల్ సిగ్నల్స్ లేకపోవడంతో ఉద్యోగులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మారుమూల గ్రామాల్లో సైతం సెల్ టవర్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చొరవతో ఎయిర్‌టెల్ టవర్ నిర్మాణం జరిగిందని, బుధవారం నుంచి సెల్ సిగ్నల్ సేవలు అందుబాటులోకి రావడంతో పంచాయతీలో పండగ వాతవరణం నెలకొందని సర్పంచ్ సన్యాసిరావు తెలిపారు. సమాచారం వ్యవస్థ బలోపేతానికి కృషిచేసిన సీఎం జగన్మోహన్‌రెడ్డి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పంచాయతీ గిరిజనులంతా రుణపడి ఉంటామన్నారు.

కొండరెడ్ల జీవితాల్లో కొత్త వెలుగులు

ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలిస్తున్నాయి.. అధికారుల కృషితో వారిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఎత్తైన కొండలపై మూఢ నమ్మకాలతో బతికే కొండరెడ్ల జీవన శైలిలో పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయి..వారి జీవితాల్లో వెలుగులు ప్రసరిస్తున్నాయి.

- ఫలిస్తున్న ప్రభుత్వ చర్యలు
- పాత సంప్రదాయాలకు స్వస్తి
- ఆస్పత్రుల్లో ప్రసవానికి ముందుకొస్తున్న పీటీజీ గర్భిణులు



అధికారుల ప్రయత్నంతో పాఠశాలకు వెళుతున్న కొండరెడ్ల పిల్లలు



టేకులొద్దిలో ఆధునిక హంగులతో నిర్మించిన కీడుపాక



ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొండబడి పాఠశాల

చింతూరు : ఆదిమతెగల్లో అట్టడుగు వర్గానికి చెందిన కొండరెడ్లను ఆధునిక భాషలో పీటీజీ(ప్రిమెటివ్ ట్రైబల్ గ్రూప్)గా పిలుస్తారు. జిల్లాలో విలీన మండలాలైన కూనవరం, చింతూరు, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లోని ఎత్తైన కొండలపై వీరు నివసిస్తున్నారు. నాలుగు మండలాల్లోని 65 ఆవాసాల్లో సుమారు 2,450 కుటుంబాలుండగా 7,348 జనాభా కలిగి ఉన్నారు. ఎత్తైన కొండలపై ఆకులు, దుంపలు తింటూ పోడు వ్యవసాయమే జీవనాధారంగా వీరు జీవనం సాగిస్తున్నారు. నాటువైద్యం, మూఢాచారాలపై వీరికి నమ్మకం ఎక్కువ. శుభకార్యాల్లో కట్నాలు, కానుకలు వీరిలో మచ్చుకైనా కనిపించవు. ప్రస్తుతం వీరు ఆధునికత వైపు అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వం, అధికారుల చొరవతో వీరి జీవనశైలిలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అనాచారాల నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతున్నారు. ఆచార వ్యవహారాల్లోను ఆధునిక పద్ధతులను అవలంభిస్తున్నారు. కొండరెడ్ల అభ్యున్నతికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తుండటంతో వాళ్ల జీవన ప్రమాణాలు గతంకంటే ఎంతో మెరుగవుతున్నాయి.

మూఢనమ్మకాలకు సెలవు

మూఢ నమ్మకాలతో జీవించే కొండరెడ్ల జీవన విధానంతో పాటు ఆచార వ్యవహారాల్లో కూడా మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. పంటలు పండకపోతే దేవరకు కోపం వచ్చిందని, జ్వరం వస్తే చేతబడని, తమ పిల్లలను పాఠశాలకు పంపితే మైల పడతారని భావించే వారు ఇప్పుడు ఆ నమ్మకాలను విడిచిపెట్టారు. గర్భిణులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తుండడంతో ఆస్పత్రి కాన్పులకు సై అంటున్నారు. అమ్మఒడి, విద్యాకానుక వంటి పథకాల వల్ల పిల్లల ఉన్నత చదువులపట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. ఆ క్రమంలోనే చింతూరు మండలం ఎర్రంపేట జూనియర్ కళాశాలలోను, వీఆర్‌పురం మండలంలో కొల్లూరు, గొందూరు, కూనవరం మండలం టేకులొద్ది పాఠశాలల్లో ఎక్కువ మంది కొండరెడ్ల పిల్లలు ఉన్నారంటే అతిశయోక్తికాదు. దీంతోపాటు చింతూరు మండలం మామిళ్లబంద కొండరెడ్ల గ్రామంలో వారి పిల్లల కోసం ప్రత్యేకంగా 'కొండబడి' పేరుతో ఓ పాఠశాలను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలో ఏడు గ్రామాలకు చెందిన సుమారు 40 మంది కొండరెడ్ల పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు.

కీడుపాక..'దూరా'చారం

కొండరెడ్లు అనాదిగా కీడుపాకల ఆచారాన్ని పాటిస్తూ వస్తున్నారు. కొండరెడ్డి మహిళలు నెలసరి, ప్రసవ సమయంలో కుటుంబసభ్యులు, గ్రామస్తులకు కనిపించకుండా ఊరి బయట ప్రత్యేకంగా నిర్మించిన పాకలో నివాసముండటాన్ని కీడుపాక ఆచారం అంటారు. ఈ ఆచారాన్ని వారు తూచా తప్పకుండా పాటిస్తారు. నెలసరి సమయంలో పురుషులెవరూ ఆమెను కన్నెత్తి కూడా చూడరు. భర్త మాత్రం ఆహారం తీసుకెళ్లి పాకముందు ఉంచి ఆమెకు కనిపించకుండా వెనుతిరిగి రావడం ఆచారం. ప్రసవ సమయంలో రెండు నెలల పాటు కీడుపాకలోనే గర్భిణిని ఉంచుతారు. పాకలోనే ప్రసవం అయిన పిదప పుట్టిన బిడ్డకు తల్లే బొడ్డుపేగు కత్తిరించి ముడివేస్తుంది. ఇలాంటి ఆచారం పాటించడం వల్ల అడవి జంతువుల నుంచి, అన్నిరకాల శారీరక రుగ్మతల నుంచి కొండ దేవతలు కాపాడతారని విశ్వసిస్తారు. ఈ విషయంలో అశ్రద్ధ వహిస్తే తమ జాతికి అరిష్టమని వారు గట్టిగా నమ్ముతారు. కొండరెడ్లలో అనాదిగా వస్తున్న ఈ ఆచారానికి మాన్పించేందుకు గతంలో ఇక్కడ ఐటీడీఏ పీవోగా పనిచేసిన ఆకుల వెంకటరమణ కృషి చేశారు. కీడుపాక స్థానంలో అన్ని వసతులు కలిగిన ప్రత్యేక భవనాన్ని నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ప్రత్యేకంగా నిర్మించే భవనంలో హాలు, స్నానాల గది, మరుగుదొడ్డి ఉండేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఇప్పటివరకు అటవీప్రాంతంలో ఊరికి దూరంగా ఉన్న కీడుపాకలో ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ గడిపే మహిళలకు ఊరికి సమీపంలోనే నిర్మిస్తున్న ప్రత్యేక భవనాలు ఎంతో రక్షణగా నిలవనున్నాయి.

మౌలిక వసతుల కల్పనకు కృషి



ఐటీడీఏ ద్వారా కొండరెడ్ల గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నాం. కొండరెడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. కొండలపై ఉన్న వారి గ్రామాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యంతో పాటు వంతెనలు నిర్మిస్తున్నాం. దీంతోపాటు గ్రామాల్లో విద్యుత్ కోసం సోలారు లైట్లు, తాగునీటి కోసం సోలారు మోటార్లు, ఇళ్లకు రేకులు ఏర్పాటు చేస్తున్నాం. **– కంచర్ల సుజాత,** ఐటీడీఏ ఏపీవో, పీటీజీ కో ఆర్డినేటర్

అనంతగిరి పీఎంవోవో సరెండర్

- టోల్‌గేటుపై అపోహలు వద్దు
- కలెక్టర సుమిత్ కుమార్



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఎంపీపీ శెట్టి నీలవేణి

అనంతగిరి: స్థానిక పీహెచ్‌సీలో పనిచేస్తున్న పారామెడిక్ ఆప్తాలమిక్ అధికారి(పీఎంవోవో) లక్ష్మిని కలెక్టర్ సరెండర్ చేశారు. ఆయన బుధవారం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యసేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పారామెడికల్ ఆప్తాలమిక్ అధికారి సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని గుర్తించి, వెంటనే సరెండర్ చేశారు. అనంతరం పర్యాటకశాఖ ఆధీనంలో ఉన్న పాత రెస్టారెంట్ భవనాన్ని పరిశీలించారు. రెవెన్యూశాఖకు చెందిన స్థలంలోని ఈ అతిథి గృహం ఉందని, ఆర్అండ్‌బీ నుంచి పర్యాటకశాఖ లీజు ప్రాతిపదికన తీసుకుందని డిప్యూటీ తహసీల్దార్ లత్సా పాత్రుడు కలెక్టర్‌కు వివరించారు. లీజుకు సంబంధించిన పూర్తి సమాచారం అందజేయాలని, రెవెన్యూ, పర్యాటకశాఖల సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.

జాతీయ రహదారి 516 నిర్మాణంలో భాగంగా కాశీపట్నం వద్ద నిర్మిస్తున్న టోల్‌గేటుపై అపోహలు వద్దని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. స్థానిక ఉద్యోగులకు, ఆర్టీసీ, స్థానిక వాహనాలకు మినహాయింపు ఉంటుందని తెలిపారు. జాతీయ రహదారిలో ప్రయాణించే భారీ వాహనాలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల నుంచే టోల్ రుసుం వసూలు చేస్తారని చెప్పారు. వచ్చిన ఆదాయాన్ని జిల్లా పరిధిలోని అన్ని మండలాల అభివృద్ధికి కేటాయిస్తామని తెలిపారు.

గర్భిణులకు భోజన సదుపాయం కల్పించాలి

ప్రతినెలా వైద్య పరీక్షల కోసం పీహెచ్‌సీలకు వస్తున్న గర్భిణులకు మధ్యాహ్నం భోజన సదుపాయం కల్పించాలని ఎంపీపీ శెట్టి నీలవేణి కలెక్టర్‌ను కోరారు. మండలకేంద్రంలో పర్యటించిన కలెక్టర్ దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు.

డెక్కాపురం, బోనురు, శంకుపర్తి రహదారుల నిర్మాణ పనులు వేగవంతం చేసేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి ఇంజినీరింగ్‌శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడం లేదని తెలిపారు. టోల్ గేటు వద్ద స్థానిక వాహనాలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. జెడ్పీటీసీ దీసరి గంగరాజు పలు సమస్యలపై వినతులను అందజేశారు. సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలోని తహసీల్దార్ రాంబాయి, వైద్యాధికారి జ్ఞానేశ్వరి, ఆర్ఐ మల్లన్న, కో ఆప్షన్ సభ్యుడు మదీనా తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

ఐటీడీఏ పీవో పీవో అభిషేక్



మాట్లాతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్ : భూముల రీసర్వేలో అలసత్వం వహిస్తే సర్వేయర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ హెచ్చరించారు. బుధవారం తన కార్యాలయంలో అనంతగిరి, అరకువ్యాలీ, పాడేరు, జీకే వీధి, కొయ్యూరు, చింతపల్లి, ముంచంగిపుట్టు మండలాల సర్వే అధికారులతో రీ సర్వే పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో జాప్యం చేయకుండా నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. భూ సర్వే సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత గ్రామ సర్వేయర్లపై ఉందన్నారు. సర్వేయర్లు మూడు బృందాలుగా ఏర్పడి క్షేత్ర స్థాయిలో సర్వే, డేటా ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. మండల, గ్రామ స్థాయిలో గ్రామ సర్వేయర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. 2,140 గ్రామాల్లో సర్వే చేయాల్సి ఉండగా 460 గ్రామాల్లో సర్వే పూర్తి చేశారని చెప్పారు. సర్వే ప్రకియ కోసమే ప్రభుత్వం గ్రామ సర్వేయర్లను నియమించిందని, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సర్వే ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి పనులు

జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేష్‌రామన్



సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న డ్వామా పీడీ రమేష్‌రామన్

అడ్డతీగల: ఉపాధిహామీ పనులను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.రమేష్‌రామన్ అన్నారు.అడ్డతీగల ఉపాధిహామీ కార్యాలయం వద్ద బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీడీ మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని, చేపట్టబోయే పనుల వివరాలను గ్రామసభల్లో ప్రజల ముందు ఉంచి ఆ మేరకు పారదర్శకంగా జరపాలన్నారు. సామాజిక తనిఖీ త్వరితగతిన పూర్తి అయ్యేలా సహకరించిన సిబ్బందిని అభినందించారు. మండలంలో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకూ చేసిన 1,167 పనులకు రూ.13.13 కోట్లు ఖర్చుచేసినట్టు చెప్పారు.వీటిలో వేతనదారులకు వేతనాలుగా రూ.10.24 కోట్లు,మెటీరియల్‌కు రూ.2.89 కోట్లు వెచ్చించినట్టు తెలిపారు.సామాజిక తనిఖీ నిర్వహణలో 22 గ్రామపంచాయతీల్లో ఇద్దరు స్టేట్ రిసోర్స్‌పర్సన్లు,11 మంది డిస్ట్రిక్ట్ రిసోర్స్‌పర్సన్లు,13 మంది విలేజ్ సోషల్ ఆడిటర్లు పాల్గొన్నట్టు చెప్పారు. పనికి చెల్లించిన సొమ్ముకు వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించి రూ.2,500 రికవరీ చేసినట్టు వివరించారు.ఎంపీడీవో కె.బాపన్నదొర,ఏపీడీ కె.భాగ్యారావు,ఎస్ఆర్‌పీలు కనకారావు,సూర్య చక్రం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్రభుత్వం పెద్దపీట



జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఉపాధి కల్పన నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో జాబ్ మేళా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఉన్న నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విస్తృతంగా మెగా జాబ్ మేళాలు నిర్వహిస్తోందన్నారు. దీనిలో భాగంగా ఈనెల 19న స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జాబ్ మేళా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, నాయకులు ప్రశాంత్,సురేష్,ఎస్.బాలు, గిరిష్,వెంకటరాజు పాల్గొన్నారు.

రవాణా వాహనాల పన్ను సవరింపు



సాక్షి,పాడేరు: రవాణా వాహనాలపై విధిస్తున్న త్రైమాసిక పన్నులను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు జిల్లా రవాణా అధికారి లీలాప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.రవాణా వాహనదారులంతా సవరించిన ప్రకారం పన్నులు చెల్లించాలని ఆయన కోరారు.

పెంచిన పన్నుల వివరాలు (రూపాయల్లో)

రవాణా వాహనాలు(కిలోలు)	ప్రస్తుతం	కొత్త రేటు
3000-4500	960	1,200
4500-5500	1.280	1,595
5500-9000	1,950	2,435
9000-12,000	2,450	3.050
భారీ వాహనాలు		
6టైర్లు 18,000	3,940	4,790
10టైర్లు 25,000	6,580	8,390
12టైర్లు 31,000	8,520	10,910
14టైర్లు 42,000	10,480	13,430
16టైర్లు 49,000	11,980	15,590

వేసవిలో చల్లని కబురు

- ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు గ్రీన్ సిగ్నల్
- అన్ని కేడర్ల వారికి దక్కనున్న ప్రమోషన్
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 200 మందికి అవకాశం
- హైస్కూల్, ప్లస్ టూ స్కూళ్లలో పూర్తి స్థాయిలో ఖాళీల భర్తీ
- సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాల విడుదల
- సీనియార్టీ జాబితాలపై అభ్యంతరాలకు 19 వరకు గడువు



సబ్జెక్టు టీచర్ల సర్దుబాటుకు నిర్వహించిన కౌన్సెలింగ్ (ఫైల్)

విశాఖ విద్య: ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బడులు తెరిచే నాటికి ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తి చేసేలా డీఈవో కార్యాలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్లు నుంచి స్కూల్ అసిస్టెంట్, స్కూల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్-2 హెచ్ఎం, అదే విధంగా ప్లస్ స్కూళ్లలో పీజీటీలుగా ఉద్యోగోన్నతి పొందనున్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఆయా కేడర్లకు చెందిన సుమారు 2 వందల మందికి పైగా ఉద్యోగోన్నతులు దక్కనున్నాయి. ఈ వేసవి సెలవుల్లోనే బదిలీలు నిర్వహించేలా ఉన్నతస్థాయిలో కసరత్తు జరుగుతుండగా, మరో పక్క ప్రమోషన్లకు ప్రభుత్వం అవకాశం కల్పించడంపై ఉపాధ్యాయుల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

తీరనున్న సబ్జెక్టు టీచర్ల కొరత

హైస్కూళ్లు, ప్లస్ టూ స్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా విద్యాశాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. రేషనలైజేషన్‌లో భాగంగా ఈ ఏడాది జనవరిలో 468 మంది ఉపాధ్యాయులను హైస్కూళ్లకు సర్దుబాటు చేశారు. తాజాగా చేపట్టబోయే ఉద్యోగోన్నతులకు వీరిని కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. 2023-24 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ స్కూళ్లలో పూర్తి స్థాయిలో ఖాళీలను భర్తీ చేసేలా ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న విశాఖ డీఈవో ఎల్.చంద్రకళ ప్రత్యేక దృష్టి సారించారు.

షెడ్యూల్ ఇలా:

- హైస్కూల్ ప్లస్ స్కూళ్లలో ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన 71 మంది స్కూల్ అసిస్టెంట్లకు పీజీటీలుగా అవకాశం కల్పించేందుకు ఇప్పటికే సీనియార్టీ జాబితాలను ప్రకటించారు. వీరికి ఈ నెల 19న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.
- సెకండరీ గ్రేట్ టీచర్ నుంచి స్కూల్ అసిస్టెంట్, అదే విధంగా స్కూల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్-2 హెచ్ఎం (ప్రభుత్వ/జడ్పీ) ప్రమోషన్‌కు బుధవారం సీనియార్టీ జాబితా విడుదల చేశారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తగిన ధ్రువీకరణ పత్రాలతో ఉపాధ్యాయులు 18, 19 తేదీల్లో డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. ఉద్యోగోన్నతులకు అర్హులైన ఉపాధ్యాయులు తుది సీనియార్టీ జాబితా 20న ప్రకటిస్తారు. స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ వద్దనుకునే వారు 21, 22 తేదీల్లో డీఈవో కార్యాలయానికి రాతపూర్వకంగా తెలియజేయాలి. దీనికి సంబంధించిన ఏమైనా అభ్యంతరాలుంటే తగిన ధ్రువీకరణ పత్రాలతో డీఈవో కార్యాలయంలో సంప్రదించాలి.



గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్

ఏర్పాట్లు చేస్తున్నాం



ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా ఉద్యోగోన్నతుల జాబితాలను సిద్ధం చేస్తున్నాం. షెడ్యూల్ మేరకు జాబితాలను ప్రకటించి, ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తాం. హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. అందరికీ ఆమోదకరమైన రీతిలో ముందుకెళ్తాం.
– ఎల్.చంద్రకళ, నోడల్ అధికారి, ఉమ్మడి విశాఖ జిల్లా

ముందే బదిలీలు నిర్వహిస్తే మేలు



ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి కల్పించేందుకు ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తుండటం హర్షణీయం. ఈ వేసవిలో బదిలీలు ఉంటాయనే సంకేతాలు ఉన్నాయి. అందుకని బదిలీలు పూర్తయిన తర్వాత పదోన్నతలు ఇస్తే అందరికీ మేలు జరుగుతుంది. ఉన్నతాధికారుల ఆ దిశగా ఆలోచన చేయాలి.
– ఇమంది పైడిరాజు, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి

మంచి నిర్ణయం



ఉపాధ్యాయులకు మేలు చేసేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చక్కటి నిర్ణయాలు తీసుకుంటుంది. అర్హులైన ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించేలా ఉత్తర్వులు జారీ చేయడం మంచి నిర్ణయం. హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత తీరుతుంది. ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.
– చొక్కాకుల సూర్యనారాయణ, వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

శస్త్ర చికిత్సకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విజయమ్మ

కూనవరం: చినార్కూరు సర్పంచ్ సున్నం అభిరామ్ తల్లి సున్నం విజయమ్మకు వైద్య ఖర్చులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2 లక్షలు మంజూరైంది. రెండు మోకాళ్లకు ఇబ్బంది రావడంతో రెండేళ్లుగా నడవలేని పరిస్థితిలో ఆమె మంచానికే పరిమితమయ్యారు. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లడంతో నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికిలో మోకాళ్లకు శస్త్ర చికిత్స చేయించడంతోపాటు సీఎం సహాయనిధి నుంచి రూ.రెండు లక్షలను మంజూరు చేయించారు. సహాయ నిధి మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిలకు సర్పంచ్ అభిరామ్ కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

మారేడుమిల్లి : మండలంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అడ్డతీగల గ్రామానికి చెందిన కె.నాగేశ్వరావు బైక్‌పై చింతూరు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మండలంలోని జలతరంగిణి జలపాతం సమీపం వద్ద వాహనం అదుపు తప్పింది. కింద పడిన నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. అటువైపుగా వస్తున్న మరొక వాహనంలో అతనిని రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ప్రయాణం...భయం భయం

- ఘాట్ రోడ్డులో రక్షణ గోడలు కరువు
- వ్యూ పాయింట్ వద్ద ప్రమాదకర పరిస్థితి



మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో రక్షణ లేని వ్యూపాయింట్



మారేడుమిల్లి-చింతూరు ఘాట్ రోడ్డు కల్వర్టు వద్ద కానరాని రక్షణ గోడ

రంపచోడవరం: మారేడుమిల్లి– భద్రాచలం ఘాట్ రోడ్డులో అనేక చోట్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయి. అంతరాష్ట్ర రహదారిలో వాహన చోదకులకు భద్రత చర్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ప్రతీ రోజు ఘాట్ రోడ్డులో అనేక వాహనాలు చత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణా వైపు వెళ్తుంటాయి. వీటిలో లోడ్ లారీలు అధికంగా ఉంటాయి. అలాగే పర్యాటకులు ప్రయాణిస్తారు. మారేడుమిల్లి –చింతూరు ఘాట్ రోడ్డు సుమారుగా 55 కిలోమీటర్లు ఉంటుంది. గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని అనేక చోట్ల రక్షణ కోసం ఐరన్ గడ్డర్స్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఇంకా చోట్ల అవసరం ఉంది. అలాగే సుమారుగా ఏడు కల్వర్టులు వద్ద రక్షణ గోడలు లేవు, వాహనాలు అదుపు తప్పితే నేరుగా కల్వర్టులోకి పడిపోయే పరిస్థితి ఉంది. కల్వర్టుల వద్ద రక్షణ గోడలు అవసరం ఉంది.

ప్రమాదకరంగా వ్యూ పాయింట్

పాములేరు దాటిన తరువాత ఘాట్ రోడ్డులో ఏపీ పర్యాటశాఖ వ్యూ పాయింట్‌ను ఏర్పాటు చేసింది. వ్యూ పాయింట్ నుంచి లోయలను, కొండలను తిలకించవచ్చు. అయితే గత కొంత కాలం నుంచి వ్యూపాయింట్‌కు ఏర్పాటు చేసిన స్టీల్ రాడ్స్ రక్షణ వలయం నుంచి లేదు. దీనిని ఎవరు దొంగిలించడంతో తిరిగి ఏర్పాటు చేయలేదు. అనేక మంది పర్యాటకులు రక్షణ లేని వ్యూపాయింట్ వద్దే పోటోలు కోసం వెళ్లుతున్నారు. ప్రమాదం అంచున ఉన్న వ్యూపాయింట్‌కు తక్షణం రక్షణ వలయం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

మండిపోతున్న ఎండలు



పాడేరుకు సమీపంలోని తుంపాడ చెరువులో చిన్నారులు,యువకుల స్నానాలు

సాక్షి,పాడేరు: జిల్లాలో మూడు రోజుల నుంచి సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. దీంతో ఎన్నడూ లేని విధంగా అరకులోయ,పాడేరు, చింతపల్లి, చింతూరు, రంపచోడవరం ప్రాంతాల్లో 37నుంచి 39 డిగ్రీల వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.భానుడి భగభగలకు జనం విలవిల్లాడుతున్నారు. ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. ఇవేం ఎండలు రా నాయనా అని బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 8గంటల నుంచే ఎండ చుర్రుమంటోంది.మధ్యాహ్నం సమయంలో జనసంచారం లేక ప్రధాన రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి.అత్యవసర పనిపై బయటకు వస్తున్న ప్రజలు గొడుగులను ఆశ్రయిస్తున్నారు. ఎండవేడిమిని తాళలేక చిన్నారులు,యువకులు గ్రామాల సమీపంలోని చెరువులు,గెడ్డలు, సేలయేరులకు పరుగులు తీస్తున్నారు. జలకాలాటలతో ఉపశమనం పొందుతున్నారు. సాయంత్రం ఐదుగంటల తరువాత వాతావరణం కాస్త చల్లబడుతోంది.

12 మంది నర్సులకు పదోన్నతులు

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలో 12 నర్సులకు హెడ్ నర్సులుగా పదోన్నతలు కల్పించారు. బుధవారం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమా సుందరి పదోన్నతలు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ 12 మందికి ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలు ఆస్పత్రుల్లో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పనస దిగుబడి ప్రారంభం



మైదాన ప్రాంతాలకు వ్యాన్‌లో తరలిస్తున్న పనస

సాక్షి,పాడేరు: మన్యంలో పనస దిగుబడులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది కూడా పనస చెట్లు విరగ్గాశాయి. కాయలు పక్వానికి వస్తుండడంతో వాటిని సేకరిస్తున్న గిరిజన రైతులు మైదాన ప్రాంత వ్యాపారులకు విక్రయిస్తున్నారు. అరకులోయ,డుంబ్రిగుడ,హుకుంపేట, పాడేరు,చింతపల్లి మండలాల్లో పనసపండ్ల వ్యాపారం ప్రారంభమైంది.పక్వానికి వచ్చిన పనసకాయను సైజును బట్టి రూ.50నుంచి రూ.70ధరతో అమ్మకాలు జరుపుతున్నారు.వ్యాపారులు విశాఖ,రాజమండ్రి,తాడేపల్లిగూడెం ప్రాంతాలకు వ్యాన్‌ల ద్వారా తరలిస్తున్నారు.

ఉపాధి వేతనదారులతో ఎంపీడీవో విచారణ



కూలీలను విచారిస్తున్న ఎంపీడీవో మేరీరోజ్, ఏపీవో రాజు

కొయ్యూరు: మూలపేట పంచాయతీలో కొందరు బాలలు ఉపాధి పనులు చేస్తున్నట్టు బాలల హక్కుల కమీషన్ నుంచి వచ్చిన ఆదేశాలపై ఎంపీడీవో మేరీరోజ్ బుధవారం ఉపాధి కూలీలతో విచారణ నిర్వహించారు. పంచాయతీలో కొందరు బాలలు ఉపాధి పనులకు వెళ్తున్నట్టు కొందరు బాలల హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయాలని కమీషన్ ఎంపీడీవోను ఆదేశించింది. ఈ మేరకు ఆమె విచారణ చేశారు. ఆమె మాట్లాడుతూ కొంతమంది వేతనదారులు తమ పిల్లలు సమీప సాగునీటి కాలువల్లో చేపలు పట్టడానికి వెళ్తారనే భయంతో తమ వెంట తీసుకొచ్చినట్టు చెప్పారని, మరికొందరు పిల్లలను తమ వెంట తీసుకొచ్చామని, పనులు చేయించలేదని తెలియజేశారన్నారు.దీనికి సంబంధించి పూర్తి వివరాలతో బాలల హక్కుల కమిషన్‌కు నివేదిస్తామన్నారు. ఏపీవో రాజు, డౌనూరు ఎంపీటీసీ అప్పారావు తదితరులున్నారు.

నాలుగు తాటాకిళ్లు దగ్ధం

- రూ.10 లక్షల ఆస్తినష్టం
- ఒక ఇంటిలో రూ.4 లక్షల నగదు అగ్నికి ఆహుతి



అగ్నిప్రమాదంలో దగ్ధం అయిన రూ.500 నోట్లు

అడ్డతీగల: మండలంంలోని తిమ్మాపురం వాల్మీకి వీధిలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో నాలుగు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.10 లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్టు అంచనా. గ్యాస్ లీకవ్వడం వల్ల మంటలు వ్యాపించి ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. పక్కనే ఉన్న ఇళ్లకు వేగంగా మంటలు వ్యాపించాయి. బొంకు జ్ఞానబాబు ఇంటిలో భద్రపరిచిన రూ.4 లక్షలు నగదు అగ్నికి ఆహుతైంది. కొలిపె ముసిలి,రాజాల కన్నారావు,వజ్రంగి బాబిలకు చెందిన తాటాకిళ్లు అగ్నిప్రమాదంలో దగ్ధం అయ్యాయి.నాలుగు ఇళ్లలోనూ అన్ని వస్తువులు పూర్తిగా కాలిపోవడంతో ఆయా కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలారు. ప్రమాదాన్ని గమనించిన గ్రామస్తులు మంటలను ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.నిరాశ్రయులైన నాలుగు కుటుంబాలను వైస్ ఎంపీపీ కరణం వీరవెంకట సత్యనారాయణ తదితరులు ఓదార్చి గ్రామస్తులతో కలసి వారికి భోజన ఏర్పాట్లు చేశారు.

క్రికెట్ టోర్నీ విజేత దుమ్మాపుట్టు



టోర్నీ విజేతలకు నగదు, షీల్డ్ అందజేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ తమర్భ నర్సింగరావు

పాడేరు రూరల్ : గిరిజనుల ఇలవేల్పు, ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ తల్లి రాష్ట్ర గిరిజన జాతర సందర్భంగా పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన 35వ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీలో దుమ్మాపుట్టు జట్టు విజేతగా నిలిచింది. గత నెల రోజులుగా నిర్వహించిన ఈ టోర్నీలో రాష్ట్ర నలుమూలల నుంచి 76 జట్లు పాల్గొన్నాయి. విన్నర్స్‌గా దుమ్మాపుట్టు జట్టు నిలవగా రన్నర్స్‌గా సీనియర్ సిటిజన్స్ లోచలిపుట్టు జట్టు, మూడో స్థానంలో కేవీఆర్ లాడ్జీ పాడేరు, తగరపువలస జట్లు నిలిచాయి. విజేతలకు నగదు బహుమతి, షీల్డ్‌లను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్భ నర్సింగరావు, పాడేరు సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వర్తన పిన్నయ్యదొర, నవర మోదకొండబాబు, స్పాన్సర్ల చేతుల మీదుగా అందజేశారు. టోర్నీ నిర్వాహకులకు కె.దుర్గారావు, మహేష్, రాజారావు, నరేష్, సతీష్‌లను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు, తదితరులు అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తెడబారిక సురేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, ఎస్వీఎం ఫార్మర్ ప్రొడ్యుసర్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ కుర్రబోయిన సింహాచలం, పాడేరు మాజీ ఎంపీపీ వర్తన ముత్యాలమ్మ, వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగ జిల్లా అధ్యక్షుడు గంపరాయి దిలిప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూనవరం సర్పంచ్‌గా హేమంత్ కుమార్



సర్పంచ్‌గా ఎంపికైన హేమంత్ కుమార్‌ను అభినందిస్తున్న నాయకులు

కూనవరం: స్థానిక మేజర్ పంచాయతీ నూతన సర్పంచ్‌గా మల్లంపల్లి హేమంత్ కుమార్ బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇప్పటి వరకు సర్పంచ్‌గా కొనసాగిన కట్టం రాజమ్మ ఈనెల 7న అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఉప సర్పంచ్‌గా కొనసాగుతున్న మల్లంపల్లి హేమంత్ కుమార్‌ను పంచాయతీరాజ్ చట్టం నిబంధనల మేరకు సర్పంచ్‌గా ఎంపిక చేసినట్టు ఎంపీడీవో రామకృష్ణా రెడ్డి, కార్యదర్శి సురేష్ తెలిపారు. నూతంగా ఎంపికై న సర్పంచ్ హేమంత్ కుమార్‌ను స్థానిక ఎంపీటీసీ కొమ్మాని అనంతలక్ష్మి, మేరుకులం డైరెక్టర్ దీకొండ గంగాధర్, వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల కన్వీనర్ ఆవుల మరియాదాస్, కొమ్మాని మోహన్‌రావుల తోపాటు వివిధ పార్టీల నాయకులు అభినందించారు.

బొజ్జన్నకొండపై మయన్మార్ బృందం



బొజ్జన్నకొండను సందర్శించిన మయన్మార్ మత వ్యవహారాలు, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ప్రతినిధుల బృందం

తుమ్మపాల: ప్రముఖ పర్యాటక ప్రాంతం బొజ్జన్న కొండను మయన్మార్ మత వ్యవహారాలు, సాంస్కృతిక మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి బృందం బుధవారం సందర్శించింది. ఈ బృందంలో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ న్యోమైంట్‌టున్, అసిస్టెంట్ డైరెక్టర్లు టున్‌టున్‌ఎయ్, ఫియోఫ్యాకెకో, మేమైట్‌నోకో ఉన్నారు. వీరు బొజ్జన్న కొండపై గల పురాతన హీనయాన, మహాయాన, వజ్రయాన వంటి ప్రధాన స్థూపాలతో పాటు పురాతన ఆనవాళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కొండకు గల ప్రత్యేకత, చారిత్రక అంశాలను టూరిజం శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. భారతదేశ పర్యటనలో భాగంగా విశాఖ, అనకాపల్లి జిల్లాలకు వచ్చిన ఈ బృందానికి కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక భద్రత, సౌకర్యాలను ఏర్పాటు చేశారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా వారు విశాఖలోని తొట్లకొండ, బావికొండ, పావురాల కొండ ప్రాంతాలను కూడా సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి దాసు, కార్యనిర్వహణ అధికారి నవీన్, పీలా మహోదయ, గైడ్ రామకృష్ణ, పాల్గొన్నారు.

రేపు ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్), కె.సుధ (టెక్నికల్) తెలిపారు. పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 660 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఆపరేటర్, కస్టమర్ రిప్రజెంటేటివ్స్, ఎగ్జిక్యూటివ్, క్యాషియర్, జూనియర్ క్యాడ్ ఇంజినీర్, వేర్‌హౌస్ అసోసియేట్స్. జీఐఎస్ ఇంజినీర్ కేడ్, టెలి కాలింగ్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, ఎఎస్ఎం, డేటా ఎంట్రీ, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, రిలేషన్‌షిప్ అధికారులు, ప్లానింగ్ అధికారి, ఐటీ రిక్రూటర్, ట్రైనీలు, మేనేజర్స్ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీకామ్ (టాలీ), బీటెక్, ఎంబీఏల్లో ఉత్తీర్ణత సాధించిన 18–40 సంవత్సరాల స్త్రీ,పురుష అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగం బట్టి జీతం నెలకు రూ10వేలు నుంచి రూ35,000ల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్ నందు తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

భర్తను హతమార్చిన కేసులో ఏడో నిందితుడు అరెస్టు

చోడవరం రూరల్: పక్కా ప్రణాళికతో సినిమా ఫక్కీలో భర్తను హతమార్చిన భార్య కేసుకు సంబంధించి ఏడో నిందితుడు అనకాపల్లికి చెందిన పంచదారల కనకసాయి ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. కేసు దర్యాప్తు చేస్తున్న చోడవరం సీఐ బి. శ్రీనివాసరావు బుధవారం వెల్లడించిన వివరాల ప్రకారం ... ఏప్రిల్ 17న చోడవరం మారుతీనగర్‌లో ఉద్రాక్ష హరివిజయ్‌ను హత్య చేసి మృతదేహాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని హతుడు స్వగ్రామం ముంచంగిపుట్టు మండలం చివుకుచింతకు కారులో తరలిస్తుండగా పాడేరులో గస్తీ పోలీసులకు చిక్కిన విషయం విదితమే. ఈ కేసులో భార్య ప్రీతి, ఆమె తండ్రి శంకరరావు, ప్రియుడు బలయాది సింహసాయి ప్రణయ్‌లతో పాటు ఏడుగురి ప్రమేయం ఉన్నట్టు సాక్ష్యాధారాలను సేకరించారు. ఈ మేరకు అచ్చుతాపురం మండలం చోడాపల్లికి చెందిన లావేటి లలిన్‌కుమార్, అచ్చుతాపురానికి చెందిన కర్రి రాము, అనకాపల్లికి చెందిన పిట్లకొండ రాజు అలియాస్ బషేర్‌లను ఈ నెల ఒకటిన అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పట్లో ఏడో నిందితుడు పంచదారల కనకసాయి వివరాలు వెల్లడించకుండా పోలీసులు గోప్యత పాటించారు. ఎట్టకేలకు అనకాపల్లి శారదా నది ఒడ్డున శివాలయం వద్ద కనకసాయిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి నిందితులందరినీ అరెస్టు చేసినట్టయ్యిందని, త్వరలోనే చార్జీషీటు దాఖలు చేస్తామని పేర్కొన్నారు.

20న డీటీపీ పోస్టుకు రాత పరీక్ష

మహారాణిపేట: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు విభాగంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీటీపీ) ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నవారికి ఈ నెల 20 సత్యం జంక్షన్ సమీపంలో ఉన్న క్రాంతి నగర్ (నక్కవానిపాలెం)లో శ్రీ శారద విద్య నిలయం ప్రాంగణంలో కంప్యూటర్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. అర్హులైన అభ్యర్థులు ఆధార్ కార్డును తీసుకొని 20వ తేదీన ఉదయం 9 గంటలకు శ్రీ శారద విద్య నిలయం ప్రాంగణానికి చేరుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డిఎంహెచ్‌ఒ) డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.

యూపీఎస్‌సీ పరీక్షకు పక్కా ఏర్పాట్లు

- జిల్లాలో హాజరుకానున్న 10,865 మంది అభ్యర్థులు
- జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

విశాఖ విద్య: జిల్లాలో ఈ నెల 28న జరగనున్న యూపీఎస్‌సీ ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. యూపీఎస్‌సీ పరీక్ష నిర్వహణపై బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 29 సెంటర్లలో 10,865 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. రెండు జోన్లలో జరుగుతున్న పరీక్షలకు భీమిలి, విశాఖపట్నం ఆర్డీవోలు జోనల్ అధికారులుగా ఉంటారన్నారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. గంట ముందుగా మాత్రమే పరీక్ష కేంద్రం తెరవాలన్నారు. పరీక్ష ప్రారంభమయ్యే 10 నిమిషాలకు ముందు మాత్రమే అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించాలని చెప్పారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, డిజిటల్ పరికరాలు వంటివి అనుమతించమన్నారు. ప్రతి ఒక్కరినీ విధిగా తనిఖీ చేసి పరీక్ష హాల్లోకి పంపాలని సూచించారు. సూపర్‌వైజర్లుగా విధులు కేటాయించిన అధికారులు పరీక్షకు మూడు రోజుల ముందు అన్ని కేంద్రాలను తనిఖీ చేసి ప్రతి ఒక్క పరీక్ష హాలులో గోడ గడియారాలు అమర్చాలన్నారు. కేంద్రాల్లో అదనంగా 2 రూములు సిద్ధం చేసి ఉంచాలన్నారు. 144 సెక్షన్ అమలు చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరుకొనేలా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంచినీరు సదుపాయం కల్పించాలని జీవీఎంసీ అధికారులకు జేసీ సూచించారు. ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని వైద్య శాఖ అధికారులను, విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవోలు హుస్సేన్‌సాహెబ్, భాస్కర్‌రెడ్డి, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఈశ్వరరావు, విద్యుత్, ఆర్టీసీ, జీవీఎంసీ, పోలీస్, రెవెన్యూ, పోస్టల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ



రావత్‌కు అప్పన్న జ్ఞాపికను అందజేస్తున్న టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆర్థికశాఖ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ ఎస్.ఎస్.రావత్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు అందజేశారు.

నేడు కేంద్రమంత్రి, మాజీ ఉపరాష్ట్రపతి రాక

మహారాణిపేట: కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి గురువారం విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో సాయంత్రం 5.10 గంటలకు విశాఖ చేరుకుంటారు. అక్కడ నుంచి పాండురంగాపురంలో ఉన్న ఐ.విష్ణురావు ఇంటికి వెళతారు. అక్కడ కొద్ది సేపు ఉంటారు. రాత్రి 10. 30 గంటలకు విమానంలో హైదరాబాద్ వెళతారు,

మాజీ ఉపరాష్ట్రపతికూడా..

మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు గురువారం ఉదయం 11 గంటలకు వాల్తేరు క్లబ్‌లో ఐ.విష్ణురావు సంతాప సభకు హాజరవుతారు. రాత్రికి తిరిగి పోర్టు గెస్టు హౌస్‌కు చేరుకుంటారు. 20న ఉదయం 7.40 గంటలకు విమానంలో బెంగళూరు వెళతారు.

మార్గమధ్యంలో నిలచిపోయిన బస్సు



వట్టిగెడ్డ వద్ద నిలచి పోయిన రేవళ్ల బస్సు

రాజవొమ్మంగి: ఏలేశ్వరం డిపో నుంచి కొయ్యూరు మండలం రేవళ్ల వెళ్లాల్సిన నైట్‌హాల్ట్ ఆర్టీసీబస్సు సాంకేతిక పరమైన కారణాలతో మంగళవారం రాత్రి మండలంలోని వట్టిగెడ్డ గ్రామం వద్ద నిలచిపోయింది. దీంతో ప్రయాణికులు ఆటోలు, ద్విచక్ర వాహనాలపై గమ్యస్థానాలకు చేరుకున్నారు. మరమ్మతులు చేసిన అనంతరం బస్సు సర్వీసును పునరుద్ధరించారు.